'ఇందులో కొచ్చెయ్యండి' అని పక్క కుర్చీ చూపించాడు.

ముకుందరావు కొంచెం గాభరాపడి లేచి- 'ఏమిటోయ్! ఇతను నీ ఫ్రెండా?' అని పక్క కుర్చీలో కూచున్నాడు.

కృష్ణయ్య 'అవునండీ - నిన్ననే వొచ్చాడు' అన్నాడు కుర్చీలో కూచుంటూ. రామ్మూర్తి చెవిలో 'ఏమిట్రా నా తండ్రీ ఆయనతో అప్పుడే యుద్ధం చేశావా?' అన్నాడు.

'చంపేశావురా బాబూ! ఇప్పుడా నిన్న పొద్దుటినుంచీ కనిపించినప్పుడల్లా దెబ్బలాడుతూనే వున్నాను మనవాడేనేంటి కొంపదీసి?' అని నవ్వాడు రామ్మూర్తి.

'అంత దగ్గిరవాడు కాదులే'

మర్నాడు ఉదయం ఎనిమిదింటికి ముకుందరావు స్నానం చెయ్యడానికి పెరట్లోకి వెళ్తున్నాడు. ఇంతట్లో మిత్రుడు వెంకటేశ్వరరావు వొచ్చి 'ఏమోయి ముకుందం' అన్నాడు.

'ఏమిటిలా కొట్టుకొచ్చావు పొద్దున్నే?' అన్నాడు ముకుందరావు.

'సరి. అప్పుడే మరిచిపోయావ్? మీ అమ్మాయికి తగినవరుణ్ణి చూస్తానని నేను మాటిచ్చాను!'

'ఓహో! తీసుకొచ్చావేమిటి?'

'ఇప్పుడా! నిన్ననే తీసుకొద్దామనుకున్నాను తీరుబడి లేకపోయింది. సాట్లో కూచోబెట్టాను ఓమాటు రాలేవూ?'

'రాలేక పోవడమేం?'

సావిట్లోకి వచ్చేరిద్దరూ. కుర్చీలో కూచున్న యువకుణ్ణి చూసి ముకుందరావు తెల్లబోయాడు.

'ఇతనా?-నాకు తెలుసునయ్యా!' అన్నాడు అప్రయత్నంగా.

'ఎలా తెలుసు?'

'అది వేరే కథ—అం-హం-సరే బాగానే వుంది-నాకు తెలిసినంతమట్టుకు కుర్రాడు ఘట్టివాడే!'

# నిర్దాక్షిణ్యం

యం. హీరాలాల్ రాయ్

జేబులో పది డబ్బులుంటే, మనిషి ఆకాశంలోకి చూస్తాడు. ఖాళీ జేబు కనపడేప్పటికి కళ్లు కిందకి దిగుతాయి. ఇది మనిషి తప్పు కాదు. ఇది డబ్బు తప్పు. ఈ డబ్బును సృష్టించిన దుర్మార్గుడెవడో కాని, మనిషిలో హృదయాన్ని చంపి క్రూరత్వాన్ని నింపి, లోకాన్ని పాడుపాడు చేశాడు. డబ్బుకోసం దొంగతనాలు, డబ్బుకోసం పోరాటం, డబ్బుకోసం హత్యలు, డబ్బుకోసం మాన భంగాలు, డబ్బుకోసం అన్నీ. ఏదైనా ఒక ప్రభుత్వం గట్టిగా "ఈ డబ్బు చెల్లదు" అని శాసనం చేస్తే ఎంత బాగుండును! ఆ శాసనం "ఎనౌన్సు" చేసిన మరుక్షణాన, కోటీశ్వరులు గుండె పగిలి చచ్చేవాళ్లు. లక్షాధికార్లకు మూర్ఛరోగం వచ్చి నాలుగు రోజుల్లో చచ్చేవాళ్లు. వేలూ వందలూ వున్నవాళ్లు టైఫాయిడ్‌తో బాధపడి క్రమంగా కోలుకునే వాళ్లు. నాలాటి ఏమీ లేనివాడు ఒక్క గంతువేసి మరో పదిపౌన్లు బరువు పెరిగేవాడు.

ఓమరు ఖయ్యాం రోజుల్లో, డబ్బు చెలామణిలో వుందో లేదో కాని వున్నప్పటికీ-డబ్బు అంతగా అవసరముండేదనుకోను ఎటు చూచినా ఇప్పచెట్లు, ద్రాక్ష తీగలు పైనుకు పదిగిన్నెల సారాయి. చేయిచాచి ఓ గ్లాసెడు సారాయి పోయవయ్యా అంటే, నేడు మంచి నీళ్లందించినట్టు ఇచ్చేవాళ్లు. పళ్లు, కూరగాయలు, ధాన్యాలు చవకగా దొరికేవి. అందుకే ఓమరు మహాకవి "బాగా తాగి, తిని, ప్రియురాల్ని అనుభవించి చావ"మన్నాడు హాయిగా. నేడు అలాకాదు. ఎంత పెనుగులాడినా కడుపునిండా తిండి దొరకదు. పెళ్ళాం అంటూ వుంటే, దాని పొట్ట నింపేవరకు తలప్రాణం తోకకు వస్తుంది. ఎంత కిరాయి పెట్టినా, బస్తీల్లో మంచి ఇల్లుదొరకదు. మంచి తిండి లేదు. ఇట్లా నరకంలో బతకడం నేడు మానవునికి ఎంతో చికాకు కలిగిస్తున్నది,

ఇట్లా బాధపడే సామాన్యుని పక్కనే మరొకడు ఆనందంగా స్వర్గసౌఖ్యం పొందడం లేదనలేం. వాణ్ణి చూచి సామాన్యుడు మండిపోవడంకూడా జరుగుతోంది. ఇది ఈర్ష్య...? లేక ఓర్వలేని తనమా! కాదు. కాదు.

డబ్బున్నవాడు మరీ డబ్బు సంపాదించే వీలు వున్నది ఈ లోకాన. లేనివాను మరీ పతనమై చచ్చే వీలూ వుంది. ఇంత పెద్ద వ్యత్యాసము ఎన్నడో ప్రమాదానికి దారితీస్తుంది. తప్పదు. అందుకే ఇంగ్లీషువాళ్ళు సోషలిజం గూర్చి మాట్లాడుతున్నారు. అమెరికన్లు అలాగే దారికి వస్తే బావుండును. గబగబా ఈ వ్యత్యాసాల్ని సర్దివేయకపోతే, ఊరూరా ఇంటింటా ప్రళయం కప్పుకునేట్టుంది.

అన్నట్టు మొన్న మా నగరంలో పిచ్చయ్య సేటు ఎనిమిదవ సినిమాహాలూ, ఆరవ బట్టల కొట్టు, మూడవ నూనె మిల్లు, పదకొండవ లారీ, ఒకటవ ఎలెక్ట్రిక్ సామాన్ల దుకాణం ప్రారంభించాడు. ఇదీ ఆయన వ్యాపారంలో అభివృద్ధి. ఆయన నాకు మిత్రుడు.

ఆయన ఇంటి ప్రక్కనే నాకు మరో మిత్రుడున్నాడు. అతను వెనుకటి జమీందారు. క్రమంగా భూములన్నీ తగాదాల్లోపోయి ఇంట్లో జబ్బులవల్ల డబ్బుపాడై, కాంగ్రెసులో చేరి జైళ్ళకు వెళ్లడం మూలాన ఆరోగ్యం నశించి, నేడు తాను వుంటున్న ఇల్లు కూడా అమ్ముకుని అద్దెకొంపలో బతుకుతున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా, ప్రభుత్వపక్షులు ఆయనకు వ్యతిరేకమే. దేశం తాను అనుకున్నరీతి బాగుపడలేదని అతని ఆరాటం. బాగుపడకపోగా చెడుతోందని ఆదుర్దా. ఏంచేయగలడు.

ఎనిమిదవ సినిమాహాలు కట్టించిన సేటు నేడు కాంగ్రెసు నిన్న మరోటి, మొన్న మరోటి. నిన్నటి కాంగ్రెసువాడు నేటి ఈ జట్టునంతా చూచి ఆశ్చర్యపోతూన్నాడు. నా కాంగ్రెసు మిత్రుడు తాను సామ్యవాదిని కాబోతున్నట్టు నాకు చెప్పాడు. అది వూరంతా తెలిసింది.

అనుకోకుండా ఇంతలో ఒక సంఘటన జరిగింది. సేటుగారి బంగాళామీద మొన్నరాత్రి రాళ్ళవర్షం కురిసింది. నిన్న పోలీసులు కాపలా వున్నారు. పోలీసులమీద కూడా రాళ్లుపడ్డవి. ఇదంతా, సోషలిస్టుల్లో చేరుతున్నవాడు చేయిస్తూన్నాడని సేటు ఫిర్యాదు చేశాడు.

అసలు రాళ్లు వేసినవాళ్లు దొరికారు. వాళ్లను పట్టుకొని ఇంటరాగేట్ చేస్తే వాళ్లు చెప్పింది ఇది:—

'అయ్యా! మేం రోజురోజూ ఎంతకష్టపడ్డా ఇంకా దిగజారుకొపోతున్నాం. ఆ మొన్న కారంలేకుండా తిండితిన్నాం. మొన్న పులుసూ దొరకలేదు. నిన్న అసలు బియ్యం దొరకలేదు. కొసేళక్తి క్షీణించింది. ఈ సేటుగారి కొట్లల్లో సామాను ధరలు ఇంతగా పెరిగితే మేం ఎట్లా బతకం.! కసిపట్టలేక రాళ్ళు వేశాం' అన్నారు.

'అయితే, ధరలు పెరిగినందుకు సేటు ఏం చేస్తూన్నాడు? పైన ధర పెరిగితే కింద ఇతనూ పెంచుతూన్నాడు. ఆతనిదేంతప్పు?' అన్నాడు పోలీసు అధికారి.

ఆ రహస్యం మాకు తెలియలేదు. పైన ఎక్కడ ఎవరు పెంచుతున్నారో చెబితే వాళ్ల మీదనే రాళ్లువేస్తాం' అన్నాడు ఆ పట్టుబడ్డ వాళ్ళల్లో ఒకడు.

నాకు ఆశ్చర్యం వేసింది. నిర్దాక్షిణ్యంగా చర్య తీసుకునేట్టే వున్నారు. ఇందుకు వాళ్లకు పాఠాలు నేర్పనక్కరలేదు. ఈదొంగల చర్యలే ప్రజలకు క్రోధం తెచ్చుకునే పాఠాలు నేర్పుతూన్నవి.

---

ఒకే సమయంలో మనం ఒక్క రకం కష్టం కంటె ఎక్కువ అనుభవించడానికి ప్రయత్నించకూడదు. చాలామంది మనుషులు ఏక కాలంలో మూడు రకాల కష్టాల్ని మోసుకు తిరుగుతారు: యిది వరకు జీవితంలో అనుభవించినవి, యిప్పుడనుభవిస్తున్నవి, యిక ముందు రాబోయేవి.—ఎవరెట్ హేల్.